సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 13 । మే । 2023



సాంగ్యాల వివాదం.. జాతరకు విరామం

రాజంపేటలోని బలిజపల్లె గంగమ్మ ఆలయ నిర్వహకుల మధ్య వివాదం నెలకొనడంతో జాతరపై సందిగ్ధత ఏర్పడింది. -IIలో..



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.128
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 767 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	425
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 246.98 కిలోలు

అమాయకులతో ఫుట్‌బాల్

- యథేచ్ఛగా సైబర్ నేరగాళ్ల ఆటలు
- జీవీఫుల్‌బాల్, మూన్‌ఫుట్‌బాల్ యాప్‌లతో మోసాలు
- రెండేళ్ల క్రితం మేకింగ్ యాప్ ద్వారా రూ. కోట్లు కొల్లగొట్టిన వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



కడప అర్బన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు తమ చేతికి మట్టి అంటకుండానే రోజువారిగా లక్షలాది రూపాయలను అమాయక ప్రజల చేత పెట్టుబడుల రూపంలో పెట్టించి, వారికి రెట్టింపు డబ్బులను ఇస్తామనీ ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు. రోజుకో ఆన్‌లైన్ గేమ్ యాప్‌ను ప్రత్యక్షమయ్యేలా చేసి లక్షలాది రూపాయలను దండుకుంటున్నాడు. మొన్న మేకింగ్ యాప్, నిన్నటి వరకు జీవీ ఫుట్‌బాల్ యాప్, తాజాగా ఆన్‌లైన్ గేమ్‌గా మూన్ ఫుట్‌బాల్ యాప్ ప్రత్యక్షమైంది.

మేకింగ్ మనీ యాప్ పేరిట..

వైఎస్సార్ జిల్లాలో 2020- 21 సంవత్సరాల్లో ఆర్‌సీసీ మేకింగ్ యాప్ అనే ఆన్‌లైన్ యాప్ ప్రవేశించి కోట్లాది రూపాయలను సైబర్ నేరగాళ్లు దండుకున్నారు. ఇంట్లోనే ఉంటూ సులువుగా డబ్బులను సంపాదించండి అంటూ ఆర్‌సీసీ మేకింగ్ మనీ యాప్ పేరిట సెల్‌ఫోన్‌లకు లింకులు పంపి అమాయకప్రజల నుంచి డబ్బులు దండుకుని మోసాలకు తెగబడ్డారు. ఎట్టకేలకు ఈ యాప్ కేసులో సైబర్ నేరగాళ్లుగా గుర్తించిన తమిళనాడులోని నామక్కల్‌కు చెందిన గోకుల్ వెందన్, ఈరోడ్‌కు చెందిన మురుగానందన్‌లను 2021 అక్టోబర్6న అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులకు సంబంధించిన 23 బ్యాంకు ఖాతాలను గుర్తించి, అందులోని రూ. 62.5 కోట్లు ఫ్రీజ్ చేశారు. ఈయాప్‌కు సంబంధించి కడప వన్‌టౌన్, చాపాడు, మైదుకూరు, దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన నాలుగు కేసుల్లో దాదాపు 100 మంది బాధితులకు నిందితులు రూ. 11 కోట్లు కుచ్చుటోపీ పెట్టారు.

- మేకింగ్ మనీ యాప్, ఆర్‌సీసీ, ఇతర యాప్‌ల పేరిట ఎస్ఎంఎస్‌ల ద్వారా లింకులను పంపుతారు. ఈ లింక్‌లను క్లిక్ చేసి, పెట్టుబడి పెడితే కమీషన్ ద్వారా అధికమొత్తంలో ఆదాయం పొందవచ్చని ఊరిస్తారు. రిజిస్టర్ చేసుకుని, యాప్ ఓపెన్ చేసి తర్వాత ట్రేడింగ్ టాస్క్ పేరిట వస్తువును ఆన్‌లైన్‌లో కొనేందుకు టాస్క్‌ను బట్టి పెట్టుబడి పెట్టాలని చెబుతారు. టాస్క్‌లో పాల్గొని అధికమొత్తంలో డబ్బులు కమీషన్ రూపంలో సంపాదించాలనే ఆశతో బాధితులు నమ్మి డబ్బులు పెట్టుబడిగా పెడతారు.
- ప్రారంభంలో కమీషన్ రూపంలో కొంత మొత్తాన్ని పంపిస్తారు. ఇలా డబ్బులు నిజంగా వస్తాయేమోనన్న ఆశతో మరింత పెద్ద మొత్తంలో తమ ఇళ్లలోని బంగారు ఆభరణాలు కుదువకు పెట్టి, స్థలాలు, ఇళ్లు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులను పెట్టారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా చాట్ చేస్తూ మోసాన్ని కొనసాగించారు.
- టాస్క్ అతి సులువుగా వుండటంతో చాలా మంది తమ సన్నిహితులతో పెట్టుబడి పెట్టిస్తారు. డబ్బులను కూడా వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏబీడీ) ద్వారా నిందితుల ఖాతాల్లోకి డిపాజిట్ చేయించుకుంటారు.
- ఆర్‌సీసీ, మనీ మేకింగ్, ఇతర యాప్‌లలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లు కనిపిస్తుంది. ఇదంతా ఫేక్ డిస్‌ప్లే. అప్పటికే బాధితుల మొత్తాన్ని ఇతర ఖాతాలకు తరలించి, సైబర్ నేరగాళ్లు దాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చుకుంటారు.

జీవీ ఫుట్‌బాల్ పేరిట నయామోసం

గత ఏడాదిలో జీవీ ఫుట్‌బాల్ యాప్ అనంతపురం జిల్లా నుంచి జిల్లాలో ప్రవేశించింది. జీవీ ఫుట్‌బాల్ యాప్ పేరిట రోజూ వేల రూపాయలు సంపాదించుకోవచ్చని జిల్లాలో పలువురిని నమ్మించి మోసం చేశారు. ఈ ఆన్‌లైన్ గేమ్ ద్వారా జిల్లాలోని అమాయక ప్రజలు నష్టపోకూడదని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆధ్వర్యంలో కడప వన్‌టౌన్‌లో సుమోటోగా కేసును నమోదు చేశారు. ఇప్పటివరకు దాదాపు 12 మంది ఈవెంట్ ఆర్గనైజర్లను అరెస్ట్ చేశారు. వారి బ్యాంక్ ఖాతాల్లోని రూ. 20 లక్షలను ఫ్రీజింగ్ చేయించారు.

- జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టిన పెట్టుబడికి 24 రోజుల్లోనే రెట్టింపు డబ్బును తమ ఖాతాల్లో జమచేసేవారు. విత్‌డ్రాలు పెట్టే మొత్తంలో 12 శాతం డబ్బును టాక్స్ రూపంలో పట్టుకుని సభ్యుల ఖాతాల్లో వేసేవారు. ప్రమోషన్స్ జరపడానికి ఈవెంట్స్ పేరుతో డబ్బులను అదనంగా టీమ్ లీడర్స్ ఖాతాలో వేసేవారు. తద్వారా ప్రమోషన్స్ పేరుతో జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో చేరి వేలాది నుంచి లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టారు. జిల్లాలోనే దాదాపు రూ. 10 కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టారని అనుకుంటున్నారు. ఈ యాప్ ప్రధాన నిర్వాహకులను పట్టుకుంటే నిజాని జాలు తెలుస్తాయి.

లింక్‌లతో మోసపోయి పెట్టుబడులు పెట్టొద్దు

లింక్‌లతో కూడిన యాప్‌లు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉండవు. సైబర్ నేరగాళ్లు స్వంతంగా తయారు చేస్తారు. యాప్ లేదా సంస్థ వ్యవస్థాపకుడు ఎవరు అనే సమాచారం ఎక్కడా అందుబాటులో ఉండదు. సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు యాప్‌లో ఎక్కడా లభ్యం కావు. యాప్ నిర్వాహకులను లేదా సిబ్బందిని సంప్రదించేందుకు ఎలాంటి కాంటాక్ట్ డీటెయిల్స్ లేవు. యాప్‌లో సర్టిఫికెట్లు, ఆధారాలు నకిలీవిగా గుర్తించారు. ఈ యాప్‌నకు యాక్టివ్‌గా సోషల్ మీడియాలో ఎక్కడా ఎలాంటి ఖాతాలు లేవు. ఈవెంట్లు నిర్వహించిన సమయంలో మాత్రమే ఆర్గనైజర్లు అప్‌లోడ్ చేసే ఫోటోలను వారు క్రియేట్ చేసుకున్న గ్రూప్‌లోనే ప్రదర్శింపచేస్తారు. ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టిన తరువాత వచ్చే లాభాలు, వ్యాపార కార్యకలాపాలన్నీ పక్కా చీటింగ్‌లా భావించేలా ఉన్నాయి.

- పోలీసులు చర్యలు చేపట్టిన తరువాత జీవీ ఫుట్‌బాల్ యాప్ సభ్యులకు ఓ ప్రకటనను పంపించారు. దీని ప్రకారం సభ్యుల ఖాతాలలో ఉన్న డబ్బులు విత్‌డ్రాలు పెట్టాలంటే ముందస్తుగా 12 శాతం ట్యాక్స్ కట్టాల్సిందేననీ తెలియజేశారు. అప్పటి నుంచి సభ్యుల ఖాతాల నుంచి విత్‌డ్రాలు కావడంలేదు. ఇంకా సభ్యులను మభ్యపెట్టేందుకు ఆన్‌లైన్ గేమ్‌లో తమ ఐడీలలోని డబ్బులను 'గేమ్ ప్లాన్'లో పెడుతూనే ఉండాలని సూచనలు చేస్తూ వచ్చారు.

ఆన్‌లైన్‌లోకి 'మూన్ ఫుట్‌బాల్ గేమ్'

జీవీ ఫుట్‌బాల్ కథ ముగిసిందని అనుకుంటున్న సమయంలోనే.. మరో ఆన్‌లైన్ గేమ్ ప్లాన్ లింక్‌లు 'మూన్ ఫుట్‌బాల్'పేరిట సైబర్ నేరగాళ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిని చూసి ప్రజలు మోసపోవద్దనీ ఇప్పటికే వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలను ఎప్పటికపుడు సైబర్ నేరాల బారిన పడవద్దని సూచిస్తున్నప్పటికీ పెట్టుబడులను పెడుతూ మోసపోతున్నారు. 2021లో ఆర్‌సీసీ మనీ మేకింగ్ యాప్ నిర్వాహకులను పట్టుకుని అరెస్ట్ చేశాం. జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో ప్రజలు మోసపోకుండా సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టాం. ఏదైనా యాప్ ప్లే స్టోర్‌లో అందుబాటులో లేకుండా కేవలం నిర్వాహకులు ఇచ్చే లింక్‌ల ద్వారా విస్తరణ చేసే యాప్‌ల జోలికి వెళ్లరాదు. ఇలాంటి యాప్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. –అన్బురాజన్, వైఎస్సార్ జిల్లా ఎస్పీ

న్యూస్‌రీల్

ఊటీ, మైసూర్‌లకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని ఊటీ,మైసూర్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ- 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 20న మదనపల్లె నుంచి బయలుదేరి బెంగళూరు వండర్ లాకు వెళుతుందన్నారు. సాయంత్రం మైసూర్ లేజర్‌షో చూశాక చాముండి హిల్స్‌కు వెళ్లి, 21న జూ, ప్యాలెస్ చూసి అక్కడి నుంచి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీ రూ.4700 చెల్లించాలన్నారు. 24న మరోబస్సు మదనపల్లె నుంచి ఊటీకి బయలుదేరుతుందన్నారు. అక్కడ పలు ప్రాంతాలు తిలకించిన అనంతరం 27న మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు. వివరాలకు 7382875034, 9440858510 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నియామకం



భాగ్యలక్ష్మి

మదనపల్లె సిటీ: విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర స్థాయి సలహా మండలి ప్రతినిధిగా స్థానిక వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులను సేవలు అందిస్తున్నారు. ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతినిధిగా ఎంపిక చేసింది. శుక్రవారం స్థానిక వెలుగు పాఠశాలలో భాగ్యలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏనుగుమల్లమ్మ ఉత్సవాలు



ఏనుగుమల్లమ్మ

బి.కొత్తకోట: ప్రఖ్యాత వేసవి విడది కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు కొండపైకి దీలు మోసుకొచ్చి ఏనుగుమల్లమ్మకు సమర్పిస్తారు. ఉత్సవపల్లకిలో అమ్మవారి విగ్రహాన్ని కొండపై ఊరేగిస్తారు. ఉట్లమాను ఏర్పాటు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. మూడురోజులు ఏనుగుమల్లమ్మ విగ్రహానికి విశేష అలంకరణలు చేస్తారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న (శనివారం) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలను ఏర్పాటు చేశారు. కడపలో ఐదు, ప్రొద్దుటూరు మూడు, రాయచోటిలో మూడు, రాజంపేట 1, బద్వేల్ రెండు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కో బెంచీని ఏర్పాటు చేశారు.

ఉపాధి పనులు విస్తృతంగా చేపట్టాలి

- ద్వామా పీడీ మద్దిలేటి



సామాజికతనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ద్వామా పీడీ మద్దిలేటి

మదనపల్లె : గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధిహామీ పనులను విస్తృతంగా చేపట్టాలని ద్వామా పీడీ మద్దిలేటి ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మదనపల్లె మండలం స్త్రీశక్తి భవనం వద్ద 17వవిడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ రెడ్డెమ్మ, వైస్ ఎంపీపీ పసుపులేటిరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ.. మండలంలో ఉపాధిపనులు ఎక్కువగా చేస్తే తద్వారా వచ్చే మెటీరియల్ నిధులతో గ్రామాల అభివృద్ధికి అవసరమైన భవనాలు, సిమెంట్‌రోడ్లు తదితరాలను నిర్మించుకోవచ్చన్నారు. వేసవిలో ఎండలు అధికంగా ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 2022–23 ఆర్థికసంవత్సరంలో రూ.6.48 కోట్ల ఉపాధినిధులు ఖర్చుచేశామని, దీనికి సంబంధించిన సామాజికతనిఖీ పూర్తిచేశామన్నారు. ఇందులో మస్టర్ల నిర్వహణలో చిన్నచిన్న పొరపాట్లను గుర్తించామన్నారు. దీనికి సంబంధించి కొత్తపల్లె పంచాయతీలో రూ.1,285, పోతపోలు రూ.514 మొత్తం రూ.1,799 క్షేత్రసహాయకుల నుంచి రికవరీకి ఆదేశించామన్నారు. సీటీఎం పంచాయతీకి రూ.1,000, మాలేపాడుకు రూ.2,000 చొప్పున అపరాధరుసుం విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రకాష్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ వెంకటేష్ నాయక్, ఏపీఓ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, ఉపాధిహామీ ఈసీ బోయకొండప్ప పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

రాయచోటి: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ శాఖ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తహసీల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి అధికారులతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువగా భూమి సమస్యలపైన అర్జీలు వస్తున్నాయని, వాటిని పరిశీలించి అందులోని అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాటిని ఎస్ఎల్ఏ గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, మండల తహశీల్దార్లు, విఆర్ఓలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

- అన్నమయ్య జిల్లాలో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో స్టేజీ కన్వర్షన్ మీద దృష్టి సారించాలని, మనబడి, నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు, మనబడి, నాడు-నేడు పనుల మీద హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు.



విద్యార్థిని వర్షితకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ గిరీషా

విద్యార్థినికి అభినందన

పీలేరురూరల్ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో జిల్లాలో 588 మార్కులతో ప్రథమ సాధించిన స్థానిక కోటపల్లె బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె. వర్షితను కలెక్టర్ గిరీషా అభినందించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థిని వర్షిత తోపాటు తల్లి ఇంద్రావతమ్మకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతి మాట్లాడుతూ విద్యార్థిని కలెక్టర్ చేతుల మీదుగా కప్ అందుకోవడం తమ పాఠశాలకు గర్వకారణమని అన్నారు.

రైతులకు సరిపడా వేరుశనగ విత్తనాలు

పీలేరు : ఖరీఫ్ సీజన్‌కు సరిపడా వేరుశనగ విత్తనాలు సిద్ధం చేస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల అవసరం మేరకు చిరుధాన్యాలు కూడా ప్రభుత్వ రాయితీతో ఇవ్వనున్నట్లు చెప్పారు. క్లస్టర్ యంత్రసేవ పథకంలో భాగంగా వరికోత యంత్రం, కిసాన్ డ్రోన్లు ప్రభుత్వ రాయితీతో అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అనిమల్‌అంబులెన్స్, టోల్ ఫ్రీ నెంబరు 1962ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏఓలు రమాదేవి, షణ్ముగం, శ్రావణి, కరుణాకర్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ

చుక్కల భూములకు సంపూర్ణహక్కు



అన్నమయ్య జిల్లా పరిధిలో చుక్కల భూములకు లభించిన పరిష్కారం వివరాలతో కూడిన మెగా పోస్టర్‌ను రైతులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా చుక్కల భూములకు సంపూర్ణ హక్కును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు కావలి వేదిక నుంచి దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ.. చుక్కల భూముల చిక్కులకు జగనన్న ప్రభుత్వం శాశ్వత పరిష్కారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 97,471 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 2,06,171 ఎకరాల చుక్కల భూములకు.. సంపూర్ణ హక్కును అందించే బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అన్నమయ్య జిల్లాలో చుక్కల భూములకు సంబంధించి 30,525 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 28,882.29 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కుతో రూ.579.832 కోట్ల మార్కెట్ విలువ కలిగిన భూములకు పూర్తి హక్కులు కల్పించదన్నారు. దశాబ్దాల సమస్యకు ప్రభుత్వం చరమగీతం పాడిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం వల్ల ఈ భూములను సర్వ హక్కులతో క్రయ విక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి వెసులుబాటు కలిగిందని కలెక్టర్ అన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం




మా ఊర్లో సర్వే నంబర్62ఏ1లో 70 సెంట్ల భూమి చుక్కల భూముల్లో పడింది. దీంతో ఏళ్ల తరబడి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా. జగనన్న మా పాలిట దేవుడు లాగా చుక్కల భూమికి శాశ్వత పరిష్కారం చూపడంతో నా కుటుంబం అంతా జగనన్నకు రుణపడి ఉంటాం. – బొజ్జ చంగల్‌రెడ్డి, బొట్లచెరువు గ్రామం, రాయచోటి మండలం

మాట నిలబెట్టుకున్నారు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో చుక్కల భూముల సమస్యలున్న రైతులను ఆదుకుంటానని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. గ్రామంలో సర్వే నెంబర్ 347/1లో విస్తీర్ణం 0.15 సెంట్ల భూమి చుక్కల భూమి ఉంది. ఈ సమస్య పరిష్కారం కావడం చాలా సంతోషంగా ఉంది. – పఠాన్ రెహమత్‌బీ, శిబ్యాల గ్రామం, రాయచోటి మండలం

రైతుల కలను నెరవేర్చిన సీఎం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : చుక్కల భూముల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం రైతులకు శాశ్వత పరిష్కారాన్ని చూపించిందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన సమావేశంలో చుక్కల భూముల విషయాన్ని ప్రస్తావించారన్నారు. గత నెలలో అసెంబ్లీలో కూడా వీటి విషయంపై చట్టం చేసినట్లు చెప్పారు. కావలిలో జరిగిన సమావేశంలో సీఎం జగన్ ఈ విషయాన్ని వెల్లడించడం హర్షణీయమన్నారు. చుక్కల భూముల రైతులు ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, లంచాలు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు రాయచోటి మునిసిపాలిటీకి కూడా ఈ హక్కుకు ఎంపికైందన్నారు. కొన్ని గ్రామాల్లో ఉండే అన్ సెక్యూర్డ్ ల్యాండ్ కూడా రీసర్వే వల్ల పరిష్కారం కాబోతోందన్నారు.చుక్కల భూముల సమస్యను పరిష్కరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి అన్నీ అప్పగిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో 1600 మందికి మేలు చేకూరనుందని ఎమ్మెల్యే అన్నారు.

ఉపాధి విస్తరించేలా!

- జాబ్‌కార్డుల విభజన
- ఇకపై పనిచేయని జాబ్‌కార్డులు యాక్టివ్
- డూప్లికేట్, తప్పు, నకిలీకార్డుల ఏరివేత

మొత్తం జాబ్‌కార్డులు:	2,54,249
కూలీలు:	3,53,317
పనిచేస్తున్న వారు :	1,02,309

బి.కొత్తకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అందరికీ పూర్తి స్థాయిలో ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిపై వివరాలు, సూచనలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి పనులు కల్పించడం, వివరాల నమోదు, వేతనాల చెల్లింపు, కార్డుల విభజనపై మార్గదర్శకాలను జారీ చేశారు. 2021కి ముందు రాగాస్ సాఫ్ట్‌వేర్, తర్వాత కేంద్ర నరేగా సాఫ్ట్‌వేర్ ద్వారా కార్యకలాపాలు మారాయి. ఈ నేపథ్యంలో కొత్త జాబ్‌కార్డుల మంజూరు, ఒక కుటుంబంలోని సభ్యుల కార్డు విభజన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అలాగే ఇటీవల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పని కల్పించడం, కొత్త కార్డుల జారీలో వెనుకబడినట్టు గుర్తించారు. రాష్ట్రంలో 2022–23లో 29.30 లక్షలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 27.12లక్షల జాబ్‌కార్డులకు చెందిన కూలీలు పనులు చేయలేదని గుర్తించారు. దీనికి కారణాలను విశ్లేషించారు. నకిలీ, డూప్లికేట్ కార్డులు, ఇన్‌యాక్టివ్‌గా ఉండటం గుర్తించి వీటిపై చర్యలకు ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. దీనితో జిల్లాకు చెందిన ఉపాధి కూలీలకు ప్రయోజనం కలగనుంది.



బి.కొత్తకోటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- అర్హులైన ఎస్సీ, ఎస్టీలు, పేద, నిరుపేదలకు ఎంతమందికి జాబ్‌కార్డులు లేవు అన్న విషయాన్ని గుర్తించేందుకు ఉపాధి సిబ్బంది ఇళ్లకు వెళ్లి పరిశీలించి అర్హులను గుర్తించాలి. వారికి తక్షణమే జాబ్‌కార్డులను మంజూరు చేయాలి.
- జాబ్‌కార్డులను మంజూరుకు వివిధస్థాయిలో నమోదు చేయాల్సిన వివరాలను పూర్తి చేయకుండా వదిలేసిన వాటి స్థితి సమీక్షించి ఎందుకు జారీ చేయలేదో కారణాలను గుర్తించి వెంటనే కార్డులు ఇవ్వాలి
- ఒకే జాబ్‌కార్డులో ఉన్న ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలను గుర్తించి వాటిని విభజించి కొత్త కార్డులను జారీ చేయాలి. ఇలాంటి జాబ్‌కార్డులు పరిశీలించినప్పుడు నలుగురు కంటే ఎక్కువ కుటుంబసభ్యులు ఉన్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఇలాంటి కుటుంబాలు వందరోజుల పని పూర్తయినట్లు నమోదవుతోంది. ఇలాంటి కుటుంబాలను గుర్తించి అందులో రెండు కుటుంబాలు ఉంటే విభజించి కొత్త జాబ్‌కార్డులను జారీ చేయాలి. దీంతో వేర్వేరుగా వందరోజుల పని కల్పించవచ్చు.
- ఉపాధి పనికి రావడంలేదు అన్న కారణంతో జాబ్‌కార్డులను ఇనాక్టివ్ చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కారణంతో జాబ్‌కార్డులోని ఒకరు కూలీకి రాకున్నా ఈ చర్య తీసుకోరాదు. ఇలాంటి వాటిని రద్దు చేయాల్సి వస్తే..తనిఖీలు నిర్వహించాలి. శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్లిన, డూప్లికేట్, తప్పుడు ధృవీకరణ పత్రాలతో పొందిన కార్డులు, ఇతరా పంచాయతీలకు వెళ్లిన కార్డులు, మున్సిపాలిటీల పరిధిలోని జాబ్‌కార్డులను మాత్రమే రద్దు చేయాలి.
- చనిపోయిన, వేరే కుటుంబానికి వెళ్లిన వ్యక్తి, మారుపేరుతో ఉన్న, నకిలీ, డూప్లికేట్ కార్డులకు చెందిన వ్యక్తుల పేర్లను ఇనాక్టివ్ నుంచి యాక్టివ్ చేయడం జరగదు.
- ఈ చర్యలతో కూలీలకు పూర్తిస్థాయి ఉపాధి పనులు దొరకడమేకాక, ఒకే కుటుంబంలో ఎందరున్నా వంద రోజుల పనితో ఉపాధి కల్పన ఆగిపోతుంది. విభజనతో అందరికి వందరోజుల పనిదినాలు ఉంటాయి. నకిలీ, డూప్లికేట్ల ఏరివేతతో ఉపాధి అక్రమాలకు చెక్ పడుతుంది. లేని కూలీల పేర్లతో ఉపాధి పనులు చేసినట్టు బిల్లుల స్వాహాకు అడ్డుకట్ట పడుతుంది.

సంఖ్య పెరుగుతుంది



ప్రభుత్వం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలతో ఉపాధి కూలీలు, జాబ్‌కార్డుల సంఖ్య పెరుగుతుంది. కూలీలకు కల్పించే పనిదినాలు పెరుగుతాయి. నకిలీలు, డూప్లికేట్‌లను గుర్తించడం ద్వారా పని చేయనట్టు నమోదవుతున్న కూలీల సంఖ్య తగ్గిపోతుంది. ఉపాధి పనుల సంఖ్య పెంచడం జరుగుతుంది. కొత్త మార్గదర్శకాలపై చర్యలు తీసుకుంటున్నాం. –నందకుమార్, ద్వామా ఏపీడీ

క్లుప్తంగా

మద్యం సేవించి యువకుడి మృతి


మృతి చెందిన శ్రీకాంత్

పుల్లంపేట : రాజంపేటకు చెందిన శ్రీకాంత్ (23) అనే యువకుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిధిలోని రెడ్డిపల్లి మద్యం షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి సమీపంలోని స్మశానం వైపు వెళ్లి అక్కడ మృతి చెందాడు. విషయాన్ని గమనించిన గ్రామస్తులు పుల్లంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పుల్లంపేట ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మండీబజార్‌లో నివాసం ఉంటున్న కోటా సురేష్‌బాబు (48) అనే వ్యక్తి ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి కనిపించడంలేదని శుక్రవారం సాయంత్రం అతని భార్య సత్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్న సురేష్‌బాబు అప్పులు ఎక్కువగా చేశాడని తెలిపింది. ఈనెల 11వ తేదీ సాయంత్రం రాజా అనే వ్యక్తి డబ్బులు అడిగి తన భర్తతో గొడవపడ్డాడని, తరువాత రాత్రి ఇంటికి వచ్చి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలిపారు.

భర్త, అత్తమామలపై కేసు

కడప అర్బన్ : కడప రిమ్స్ పోలీసు స్టేషన్‌లో ముగ్గురిపై వరకట్న వేధింపుల కేసు నమోదైంది. సరోజినీనగర్‌కు చెందిన ప్రశాంత్ ఏడు నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన రూప అనే యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భర్తతో పాటు, అత్తమామలు సలోమి, సత్యరాజ్‌లు వరకట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నారని బాధితురాలు రూప రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేశారు.

సాంగ్యాల వివాదం.. జాతరకు విరామం

- బలిజపల్లె గంగమ్మ జాతర కోసం లక్షలాదిమంది భక్తుల ఎదురుచూపు
- నిర్వాహకుల మధ్య కొనసాగుతున్న సాంగ్యాల పంచాయితీ

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఏటా నిర్వహించే గంగమ్మ జాతరకు రెండువందల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. అయితే అమ్మవారికి సమర్పించే సాంగ్యాల విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా కొంతమంది జాతర నిర్వాహకుల మధ్య వివాదం నెలకొంది. గత ఏడాది జాతరకు అంకురార్పణ చేసే తరుణంలో నిర్వాహకులు ఘర్షణలకు దిగడంతో అప్పట్లో ఆ కార్యక్రమాన్ని పోలీసులు నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో గత ఏడాది జాతర నిర్వహణకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, అప్పటి ఆర్డీఓ కోదండరామిరెడ్డి, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిలు నిర్వాహకులతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి పాతపద్ధతుల్లో ఎవరు ఏయే సాంగ్యాలు చేస్తారో ఆ సాంగ్యాలతోనే జాతర చేయాలని గట్టిగా హెచ్చరించారు. అనంతరం అధికారులు నిర్వాహకులు నిర్వహించే సాంగ్యాలకు సంబంధించి జాబితాను కూడా తయారు చేసి ఇచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గట్టి చర్యలు తీసుకోవడంతో గత ఏడాది నిర్వాహకులు జాతర చేశారు. అయితే ఈ ఏడాది కూడా నిర్వాహకుల మధ్య సాంగ్యాల సమస్య తలెత్తి జాతర విషయమై పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా ఈ ఏడాది జాతర జరుగుతుందో లేదో అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచింది. లక్షమందికి పైగా జాతరలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. అందువల్ల ఇప్పుడు ఏ నలుగురు కలిసినా బలిజపల్లె జాతర గురించి మాట్లాడుకుంటున్నారు. బలిజపల్లె గంగమ్మ జాతరను శివరాత్రి తరువాత మార్చి, ఏప్రిల్ నెలల్లో మరీ ఆలస్యమైతే మే నెల మొదటి వారంలో నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు మేనెలలో సగం రోజులు పూర్తవుతున్నా నిర్వాహకులు మాత్రం జాతర విషయమై ఎలాంటి చర్చలు జరపలేదు. దీంతో ఈ ఏడాది జాతర జరిగే అవకాశాలు చాలా వరకు సన్నగిల్లాయని అనేక మంది భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్ చొరవ చూపాలి

నిర్వాహకుల తీరు కారణంగా ఎంతో ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర ఆగిపోకుండా జరిగేలా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఈ ఏడాది కూడా తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. జాతర నిర్వహణ విషయంలో ఏటా నిర్వాహకులు వివాదాలకు వెళ్లకుండా శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జాతర విషయంలో పంతాలు వీడాలి



బలిజపల్లె గంగమ్మ జాతర ఎంతో ఘనంగా జరుగుతుంది. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తారు. జాతర ఎప్పుడు జరుగుతుందా అని వేల మంది వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు సర్వం సిద్ధం చేసుకొని ఉన్నారు. నిర్వాహకులు గంగమ్మ జాతర విషయంలో పంతాలు వీడాలి.
– ఎన్.శివరామయ్య, రిటైర్డ్ పీఈటీ, రాజంపేట

జాతర కోసం లీవు కూడా అడిగి ఉన్నా



మా సొంతూరు రాజంపేటలోని బలిజపల్లె. మా ఊళ్లో జాతర ఎంతో ఘనంగా జరుగుతుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జాబ్ చేస్తున్నా. గంగమ్మ జాతర ఎప్పుడు జరిగినా నాకు లీవు ఇవ్వాలని మా ఆఫీసులో పర్మిషన్ అడిగి ఉన్నా. నాకు జాబ్ వచ్చినందున ఈ ఏడాది జాతలో భక్తులకు అన్నదానం చేయాలనుకుంటున్నాను.
– లేబాకు సాయిప్రసన్న, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఆభరణాలు వెనక్కి తీసుకుంటాం



బలిజపల్లె గంగమ్మకు సంబంధించి కొన్ని ఆభరణాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం అమ్మవారి ఆభరణాల వివరాలు నిర్వాహకులు మాకు రాతపూర్వకంగా రాయించి ఇచ్చారు. ఒకవేళ జాతర నిర్వహించకుంటే ఆభరణాలను మేము శాఖాపరమైన చర్యలతో స్వాధీనం చేసుకుంటాము. నిర్వాహకులు జాతరను చేయకుంటే ఎవరైనా జాతర చేయమని మమ్మల్ని కోరితే భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతర నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలిస్తాము.
– విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ, అన్నమయ్య జిల్లా

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


చిన్న వెంకట్రమణారెడ్డి (ఫైల్)

కురబలకోట : ఒంటరితనం భరించలేక మండలంలోని చిన్నపరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్న వెంకట్రమణారెడ్డి (79) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు..చిన్న వెంకట్రమణారెడ్డి సాధారణ రైతు. ఇతని భార్య, కుమారుడు ఇదివరకే మృతి చెందారు. విధిలేని పరిస్థితిలో కోడలు అమ్మిన్నమ్మ కుమారుడితో కలిసి బతుకు దెరువు కోసం బెంగళూరు వెళ్లింది. అప్పటి నుంచి ఇతను ఒక్కడే ఒంటరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వయసు మీద పడడటం, ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం ఆపై ముఖ్యంగా ఒంటరితనం వేధించసాగింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

సంతకం ఇక్కడ.. సెక్రటరీ ఎక్కడ?


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ



రిజిస్టర్‌లో సంతకాలు చేసిన పంచాయతీ కార్యదర్శి

- సంతకం పెట్టి వెళ్లిపోయిన పంచాయతీ కార్యదర్శి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీడీఓ

వాల్మీకిపురం : వాల్మీకిపురం సచివాలయం –4 (ఓబులంపల్లి సచివాలయం)లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సంతకం చేసి.. ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. ఉదయం, మధ్యాహ్నానికి సంబంధించి హాజరు సైతం నమోదు చేసి విధులు నిర్వహించకుండా వెళ్లిపోవడంతో సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన స్థానికులు, గ్రామస్తులు విసిగిపోయి, స్థానిక ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ సచివాలయం 4ను తనిఖీ చేసి, విచారించి, రిజిస్టర్‌ను పరిశీలించగా కార్యదర్శి విధుల్లో ఉండి, ఉదయం, మధ్యాహ్నం హాజరు నమోదు చేసినట్లు గుర్తించారు. ఆమెవిధుల్లో లేకపోవడంతో ఎంపీడీఓ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు ఈ విషయంపై ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి రిజిస్టర్‌లో సంతకం చేసి విధుల్లో లేకుండా వెళ్లిపోవడం వాస్తవమే అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 146 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. మదనపల్లె మండలం నారమాకులతాండాకు చెందిన మూడే లోకేష్ నాయక్ తన ఇంటిలో సారా విక్రయిస్తుండగా శుక్రవారం స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బంది దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 146 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో తాలూకా సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బూతులు తిట్టాడని హత్య చేశారు

- వీడిన వెల్డర్ అక్రమ్ హత్యకేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, సీఐ

మదనపల్లె : కర్ణాటక రాష్ట్రంలో పెట్రోల్‌బంకు వద్ద తాగిన మైకంలో ఒకరినొకరు బండబూతులు తిట్టుకుని మొదలైన వివాదం ఏపీ సరిహద్దులో ఓ యువకుడి హత్యకు దారితీసింది. నాలుగు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ మదనపల్లె–బెంగళూరు మెయిన్‌రోడ్డులో కూకటిమానుగడ్డ వద్ద హత్యకు గురైన అక్రమ్ కేసు మిస్టరీ శుక్రవారం వీడింది. హత్యకేసులో వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలానికి చెందిన వల్లూరు మహమ్మద్‌రఫీ, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన వల్లూరు మాబూషరీఫ్, కురబలకోటకు చెందిన వల్లూరు నవాజ్ షరీఫ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ కేశప్ప తాలూకా పోలీస్ స్టేషన్‌లో హత్యకేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. శ్రీ సత్యసాయిజిల్లా తనకల్లు మండలం కోటూరుకు చెందిన పఠాన్ అక్రమ్(23) పట్టణంలోని నక్కలదిన్నెలో నివాసం ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 7వ తేదీ అక్రం పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన ఖాదర్‌వలీ, రెడ్డిబాషా, మరికొందరితో కలిసి ఏపీ–03టీసీ–6107 ఆటోలో మదనపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడుకు వెళ్లాడు. తిరిగి మదనపల్లెకు వస్తున్న క్రమంలో కర్ణాటక సరిహద్దులోని నయారా పెట్రోలు బంకులో ఆటోకు రూ.300కు పెట్రోల్ పోయించుకున్నారు. దీనికి సంబంధించి బిల్లు తీసుకునే విషయమై బంకు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అదే సమయానికి ఏపీ–21 ఏఎస్–5483 టాటా ఇండికా కారు డీజిల్ పట్టుకునేందుకు బంకులోకి వచ్చింది. డీజిల్ పట్టకుండా బంకు సిబ్బంది ఆటోలోని వ్యక్తులతో గొడవ పడుతుండగా, బిల్లు కోసం ఇంత రాద్ధాంతమా... తొందరగా డీజిల్ పట్టండి..మేము వెళ్లాలంటూ గట్టిగా మాట్లాడారు. దీంతో బంకు సిబ్బందితో గొడవ పడుతున్న అక్రమ్, రెడ్డిబాషాలు కారులోని వ్యక్తులైన మహమ్మద్ రఫీ, మాబూషరీఫ్, నవాజ్‌షరీఫ్‌లతో వాదులాటకు దిగారు. తీవ్రస్థాయిలో బూతులు మాట్లాడుకున్నారు. గొడవ పడేందుకు సిద్ధపడ్డారు. ఈలోపు అక్కడి స్థానికులు కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు గస్తీ అధికంగా ఉందని, గొడవలు పడితే అరెస్ట్ చేస్తారని చెప్పడంతో బార్డర్‌లో తేల్చుకుందాం రమ్మని సవాళ్లు విసురుకున్నారు. చెప్పినట్లుగానే ఆటో కర్ణాటక సరిహద్దు దాటి ఏపీలోకి ప్రవేశించగానే ఉగ్రాణంపల్లె వద్ద ఆటోకి అడ్డుగా ఇండికా కారును పెట్టారు. ఆటోలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించారు. దీంతో వాదులాటలో ఎక్కువగా తిట్టిన తనను ఎక్కడ కొడతారోనని అక్రమ్ ఆటో దిగి మదనపల్లె వైపు పారిపోయాడు. దీంతో కారులోని వ్యక్తులు అక్రమ్‌ను వెంబడించి పట్టుకుని తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ముగ్గురు వ్యక్తులు మృతదేహాన్ని రోడ్డుపక్కన చెట్టు పొదల్లో పడేసి పారిపోయారు. ఈక్రమంలో గురువారం నిందితులు మదనపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్ బావాజాన్ వద్ద లొంగిపోవడంతో ఆయన వారిని తాలూకా సీఐ సత్యనారాయణకు అప్పగించారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన మహమ్మద్ రఫీపై సింహాద్రిపురంలో గుట్కా, పక్కింటివారితో గొడవపడటం, ముదివేడులో భూతగాదాల ప్రమేయంపై మూడుకేసులు నమోదై ఉన్నాయి. బీటెక్ పూర్తిచేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మాబూషరీఫ్ ఎంబీఏ చదువుకుని ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, నవాజ్ షరీఫ్ డిగ్రీ వరకు చదువుకుని అంగళ్లులో వ్యాపారం చేసుకుంటున్నాడు.

108లో ప్రసవం

బి.కొత్తకోట : స్థానిక రంగసముద్రం రోడ్డుకు చెందిన గర్భిణిని మదనపల్లెకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన ఘటన శుక్రవారం జరిగింది. బి.కొత్తకోటకు చెందిన నాగమణి (23) నాలుగోసారి గర్భం దాల్చింది. పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం ఇవ్వగా స్థానిక సీహెచ్‌సీలో వైద్య పరీక్షల అనంతరం మదనపల్లెకు తరలిస్తున్నారు. ఆస్పత్రికి చేరేలోపే నీరుగట్టువారిపల్లె వద్ద నాగమణి మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ దివ్యశ్రీ, పైలట్ రాజు వైద్యసేవలు అందించి ఆస్పత్రిలో చేర్పించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

ములకలచెరువు : ద్విచక్ర వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని బురకాయలకోటకు చెందిన వెంకటేష్ (33),భార్గవ (28)లు పనుల మీద ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు బయలుదేరారు. వారి వెనుకన మదనపల్లి నుంచి కదిరికి వెళుతున్న ఇన్నోవా వాహనం వేపూరికోట సమీపంలో వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భూవివాదంలో కిరాయి రౌడీలు అరెస్ట్

మదనపల్లె : మండలంలోని కురవంక పంచాయతీలోని భూవివాదంలో తిరుపతికి చెందిన ఐదుగురు కిరాయిరౌడీలను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ శివారు ప్రాంతమైన కురవంక సర్వే నంబర్.420లో భూమికి సంబంధించి ఇద్దరి మధ్య వివాదం నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఒక వర్గానికి చెందిన వ్యక్తులు భూమిలో పనులు చేస్తుండగా, మరో వర్గానికి చెందిన వ్యక్తులు తిరుపతి నుంచి కొందరు కిరాయిరౌడీలను తీసుకువచ్చి పనులను అడ్డుకున్నారని చెప్పారు. దీంతో పట్టణానికి చెందిన సునీత తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లి నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భూ వివాదంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతి రామాపురంలో భూమి తగాదా విషయంలో ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఉమాశంకర్ అనే వ్యక్తి పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని దున్నుతుండగా ఇదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అడ్డుకుని కొడవలితో ఉమా శంకర్‌పై దాడికి పాల్పడటంతో తల కు రక్త గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఈబీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు


జిల్లా ఎస్పీ గంగాధరరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఈబీ ఎస్ఐ అంజాద్‌బాషా

మదనపల్లె : ఏడాదికాలంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల అదుపులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రశంసాపత్రాలను అందజేసింది. ఎస్ఈబీ కమిషనర్ డాక్టర్.ఏ.రవిశంకర్ అందించిన ప్రశంసాపత్రాలను అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధరరావు సిబ్బందికి అందజేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో మదనపల్లె ఎస్ఈబీకు చెందిన సీఐ వెంకటలక్ష్మి, ఎస్ఐ అంజాద్‌బాషా, బీఎంపీపీ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది చంద్రశేఖర్, త్రిపుర, పీరయ్య ఉన్నారు. విధి నిర్వహణలో ఉత్తమసేవలందించి రాష్ట్రప్రభుత్వం ప్రశంసలు అందుకున్న మదనపల్లె ఎస్ఈబీ సిబ్బందిని అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, ఏఈఎస్ రాధాకృష్ణ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి


మృతిచెందిన బొజ్జయ్య, క్రిష్ణమ్మ

అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వివిధ పనుల నిమిత్తం వాహనాల్లో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదాలు జరిగాయి. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పెద్దమండ్యం : పెద్దమండ్యం–గుర్రంకొండ, పెద్దమండ్యం–తంబళ్లపల్లె రహదారులపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో శుక్రవారం ఇద్దరు మృతిచెందారు. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శిద్దవరం పంచాయతీ కోటగుట్టపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. తంబళ్లపల్లె మండలం కోటకొండ గ్రామం మండ్యంవారిపల్లెకు చెందిన బొజ్జయ్య (60) పాడి ఆవుల కోసం సీగొల్లపల్లె పంచాయతీలోని రెక్కలకొండపల్లెకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. అక్కడి నుంచి రెక్కలకొండపల్లెకు చెందిన ఆర్.వెంకటరమణను ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని తురకపల్లె వైపు బయలుదేరాడు. కోటగుట్టపల్లె వద్ద పెద్దమండ్యంకు వస్తున్న తహసీల్దార్ కారు ఢీ కొంది. ప్రమాదంలో బొజ్జయ్య అక్కడికక్కడే మృతిచెందగా, ఆర్ వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ గాయపడిన వ్యక్తిని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు సేకరించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, సంఘటన స్థలాన్ని ములకలచెరువు ఇన్‌చార్జి సీఐ శివాంజినేయులు పరిశీలించారు.

● బొలెరో.. ఆటో ఢీకొని..

పెద్దమండ్యం : పెద్దమండ్యం– తంబళ్లపల్లె రహదారిలో చెరువుకిందపల్లెకు సమీపంలో నల్లగుట్టమలుపు వద్ద బొలెరో, ఆటో ఢీ కొన్న సంఘటనలో క్రిష్ణమ్మ అనే మహిళ మృతి చెందింది. పెద్దమండ్యం పంచాయతీలోని ఉప్పరపల్లెకు చెందిన క్రిష్ణమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి గుర్రంకొండ మండలం తుమ్మంగొందికి ఆటోలో వెళుతుండగా, పెద్దమండ్యం నుంచి తంబళ్లపల్లెకు వెళుతున్న బొలెరో పికప్ వాహనం ఆటోను ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న క్రిష్ణమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వినోద్‌కుమార్ పరిశీలించారు. మృతురాలి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

● టెంపో ఢీకొని..


శ్రీకాంత్ ఆత్రేయ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని నవాబుకోట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు. నవాబుకోటకు చెందిన గోపరాజు సుబ్రమణ్యం కుమారుడు శ్రీకాంత్ ఆత్రేయ (26) వరికసువుపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. కర్ణాటక రాష్ట్రం చేలూరు సంతలో కొనుగోలు చేసిన గొర్రెలను టెంపోలో వేసుకుని బి.కొత్తకోటకు వెళ్తూ ప్యాయలోల్‌పల్లి వద్ద బైకును ఢీకొంది. ఈ ఘటనలో బైకుపై వెళుతున్న శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనమామ వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● లారీ ఢీకొని..


ఖాసీంవలి (ఫైల్)

ములకలచెరువు : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం రాత్రి జరిగింది. పీటీఎం మండలం రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లికి చెందిన ఖాసీంవలి (30) తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో ములకలచెరువులోని బంధువుల ఇంటికి వచ్చారు. భార్య, పిల్లలను బంధువుల ఇంట్లో వదిలేసి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా స్థానిక కేజీఎన్ కళ్యాణ మండపం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఖాసీంవలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య షబీనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.